

# ఆశించని నాయకత్వం

సోమంచి యజ్ఞన్నశాస్త్రి...

రెండో వాడితో జోక్యం కలిగించు కోక. తనేమిటో. తన పుస్తకాలేమిటో చూసుకుంటూ సాఫీగా జీవితం సాగిస్తున్న కాలేజి విద్యార్థి ఓనాడు అకస్మాత్తుగా నాయకుడయి కూచున్నాడు. అవి దేశ స్వాతంత్ర్య పోరాటం పేరిట రకరకాల సత్యాగ్రహాలు సాగుతున్న రోజులు. ఏ సందర్భంలో పేరు తెచ్చుకున్నా. గిరగిర తిరిగి. రాజకీయ సుడిగుండంలో పడి పోవడం ఆ నాటి పరిపాటి.

నేనా నాయకుణ్ణి! నే నేమిటి నాయకుణ్ణి!! అవి రామచంద్రం వెనక్కి తిరగ డానికి ప్రయత్నించాడు కాని ముందుకి తోసుకొస్తున్న జనం మొగలో నెట్టుకు పోబడ్డ మనిషిలా. అడకత్తెరలో పోక చెక్కలా రామచంద్రం ఎటూ తప్పించు

కోలేక నాయకుడయి పోయాడు; రాజకీయ నాయకుడు.

రామచంద్రం నిజానికి భయస్తుడు. ఎవరైనా ఇద్దరు దెబ్బలాడుకుంటూ వుంటే సినిమాలో నాయకులా దూరం నించే చూసి గాభరా పడేవాడు. ఒక్కొక్కప్పుడు సినిమా నాయకులు చేతి కేదయినా అందితే అది పుచ్చుకుని విలన్ నెత్తి మీద ఒక్కటి పెట్టి పెట్టడానికో, ఏకాలో అందితే కరవడానికో ప్రయత్నిస్తారు. రామచంద్రం అదీ చేసేవాడు కాడు. కళ్ళు మూసుకుని మధనపడేవాడు. లేకపోతే అర్జునా, ఫల్గుణా అని పిడుగు మంత్రం పఠించేవాడు. మరి ఈ నాయకత్వ గుణం ఎక్కడినించి వొచ్చింది అని మీ మాంస చేస్తే తేలేది. ఏదో పూర్వజన్మ వాసన అని.

నిజానికి వాసనే రామచంద్రాన్ని బయటకి లాగింది; పూర్వజన్మ వాసన కాకపోయినా. ఈ జన్మ అంతమయిపోయి, అంత్యక్రియలు జరుగుతున్నప్పటి వాసన, జీవుడికి కాక ముక్కుకి మాత్రమే తగిలే వాసన.

రామచంద్రం వుంటున్న హాస్టలులో పేకాట ఆడకూడదని ఓ నియమ ముంది. ఆ నియమం నిజానికి ఎవరూ, ఏ నాడూ పాటించరని అధికారు లందరికీ తెలుసు. ఓ కంటితో చూసి వూరుకోడమో, రెండు కళ్ళు మూసి ఇలాటి ఉల్లంఘనలు కనిపెట్టక పోడమో చేసేవారు. వార్డెనుతో సహా. కాని ఒక్కొక్క నాడు వార్డెనుకి చిరాకెత్తు కొచ్చేది. పేకాట శృతి మించి రాగాన పడినప్పుడు. 'ఈ ముక్క వేసి వుండ కూడదు. ఆ తురుపు ఎందుకు చెప్పలేదు.'' ఇలాటి ప్రశ్నలు వాగ్యుద్ధాలకి. ఒక్కొక్కప్పుడు ముష్టి యుద్ధాలకి దారితీసేవి. వార్డెను పరుగెత్తు కొచ్చి అందరినీ చీవాట్లు పెట్టడమో, మరీ విసిగిపోయిన నాడు: ఫైన్లు వెయ్యడమో చేసేవాడు.

ఓ నాడు రామచంద్రం గదిలో చేరారు పేకాటకి స్నేహితులు. నన్ను చదువుకో నివ్వండిరా అంటే వినలేదు. ''నువ్వు పేకాడవని వార్డెనుకి నీ మీద సదభిప్రాయ ముంది. అంచేత ఇక్కడ ఆడితే మాకేమీ ప్రమాద ముండదు. కిక్కురు మనకుండా గప్‌చిప్‌గా ఆడతాము ప్రేక్షక రూపంలో మా వెనకాల కూచో. లేదా. చదువుకుంటూ మంచం మీద నడుం వాల్చు. అదీ కాకుంటే, శవంలా తగ లడు. వాసన మాత్రం కొట్టకు'' అన్నారు ఒక పేకాట అసామీ ఆ హాస్టలుకి అల్లంత దూరంలో శ్మశానం వుండడంవల్ల శవాలు తగలపడడం. వాసన కొట్టడం ఆ విద్యార్థులకి కేవలం, వాగ్మయ ఉపమానాలుగా కాక. ప్రత్యక్షంగా అనుభవాలు.

పేకాట ప్రారంభమయింది. పుస్తకం పుచ్చుకుని రామచంద్రం మంచం మీద ఒరిగాడు. పది నిముషా లయేసరికి పెద్దగా వాదన ప్రారంభమయింది పేకాట భాగస్థుల మధ్య. ఎక్కడినించో అప్పుడే ఇంటికి చేరుకుంటున్న వార్డెనుగారి చెవికి, ఈ రణగొణ ధ్వనిని వాయుదేవుడు చేర్చేడు.

వార్డెనుగారికి ఆ రోజున అసలే చికాకుగా వుంది. ఇంట్లో ఆడంగులు వాకిట వుండడం. మొగాళ్ళే చేతులు కాల్చు

కోడం పరిపాటిగా వున్న రోజులవి. ఆ రోజున ఆయన చేతులు నిజంగా కాలాయి. వాకిట వున్నందుకు భార్య మీద, నాలుగు మెతుకులు వుడకేసి పెట్టడానికి తన కుటుంబంలో మరెవరూ లేనందువల్ల యావత్తు కుటుంబం మీదా. ఇలాటి బాధాకరమైన ఆచారాలు పెట్టినందుకు సమాజం మీద ఆయన మండిపోయి వొళ్ళు చల్లార్చుకునేటందుకు బయటికి వెళ్లి. చిరాకు పూర్తిగా వొదిలించుకోలేక తిరిగి యిల్లు చేరుకుంటున్న సమయంలో ఇది జరిగింది. చెరాచెరా ధ్వని వొచ్చిన వైపు పయనించాడు. ఆయన కాళ్ళ చప్పుడు మూసి గదుల అవతలే పని కట్టిన లోపలి పేకాట రాయుళ్ళు "గప్ చిప్' అయిపోయారు, పేకలు అదృశ్యమయి పోయాయి. అందరి చేతుల్లోకి పుస్తకాలొచ్చేశాయి. తలుపు మూసేసి వుంది వార్డెన్ తలుపు తట్టాడు; మెల్లిగా. ఎవరూ వినిపించుకుని తియ్యలేదు. దబదబ బాదాడు. ఇదేమీ గమనించకుండా, తన ధ్యాసలోనే వున్న రామచంద్రం లేచి తలుపు తీశాడు. ఎదురుగుండా వార్డెన్, ఆయన వెనక కొంత మంది హాస్టల్ విద్యార్థులు వున్నారు. రామచంద్రం గతుక్కుమన్నాడు. కొంచెం గాభరా పడ్డాడు.

"తలుపెందుకు మూశావు" అని గద్దించాడు వార్డెన్ పుస్తకాలు చేతులో వున్న మనుష్యుల్ని చూసి. ఎందుకు పేకాడుతున్నారు అని దబాయించలేక.

''త....త .. తలుపా' అని నస్సిగాడు రామచంద్రం.

"అవును తలుపే' అని మళ్ళీ గద్దిం చాడు. ''తలుపు మూస్తే ఏం?'' అ అడగుదామనుకున్నాడు గాని. ధైర్యం చాల్లేదు రామచంద్రానికి.

బుర గోక్కుంటూ 'శవం చచ్చి పోయింది అందుకు మూశాం''అన్నాడు దూడ గడ్డికోసం కాడిచెట్టు ఎక్కా అన్న సమాధానం కంటె ఇది కుంటిగ కనిపించింది వార్డెన్ కి. రామచంద్రం అల్లరి చిల్లరి వాడుకాడు. వార్డెన్ తో వేళాకోళం చెయ్య గలిగిన సామర్థ్య మున్న వాడుకాడు.

''శవం చచ్చిపోయిందా'' అన్నాడ వార్డెన్.

''అవును, వాసనవేసింది'' రామ చంద్రం జవాబు.

''వాసనేసిందా''

''అవును. కావలిస్తే నా ముక్కు వాసనచూడండి.'' అన్నాడు రామచంద్రం

మరీ అయోమయమయింది వార్డెన్ కి శవం చచ్చిపోడం. వాసన కొట్టడం వాసన రామచంద్రం ముక్కు వాస చూస్తే తెలియడం. ఏమిటీ గొడవ?

''నోరు మూసుకుని తిన్నగా మాట్లాడు'' అన్నాడు వార్డెన్.

రామచంద్రానికి వొళ్ళు మండింది. మే కుదిపి చూస్తే మరీ మొత్త బుద్ధి అన్నట్ట న్యాయంగా జవాబిస్తూ వుంటే. తన మీద లేస్తాడేం ఈ వార్డెను.

''నోరు మూసుకుని ఎలా తిన్నగా

మాట్లాడతం" అని గొణిగాడు మరీ పైకి అనడానికి ధైర్యం చాలక'

"షటప్"

దానితో మరీ ఉగ్రుడై పోయాడు రామచంద్రం. వార్డెన్ మీదికి వెళ్లాడు. "చూడండి. వాసన చూడండి" అని వార్డెన్ ముక్కు మీదికి తన ముక్కు పోనిచ్చాడు. అమృతాంజనం వాసన గుప్పు మంది వార్డెన్‌కి.

"ఏమిటిదంతా. మీద కెందు కొచ్చావు?"

నా ముక్కుకి అమృతాంజనం రాసు కున్నానో లేదో? చూపిస్తున్నాను నోటితో చెబితే మీకు తెలీలేదు. అందుకే ముక్కు చూపించాను.

"శవం" అని కసిగాడు వార్డెన్.

"తగలడుతూంటే వాసన వేసింది. భరించలేక! ఆ వాసన పోగొట్టుకోడానికి మరో మార్గం లేక. తలుపు వేశాను. నా ముక్కుకి అమృతాంజనం రాసుకున్నాను. ఇందులో తెలియకపోవడానికి ఏమీ లేదు. అని ధీమాగా జవాబు చెప్పాడు రామచంద్రం. ఇంకా వాదన పెంచు కుంటే లాభం లేదనిపించింది వార్డెన్ గారికి. శవం చచ్చిపోయింది....వాసన వేసింది. ముక్కుకి అమృతాంజనం అని గొణుక్కుంటూ వెళ్ళిపోయారు వార్డెన్‌గారు. వార్డెన్ కనుమరుగవగానే రామచంద్రాన్ని అతని ధైర్యసాహసాలకి అభినందించడం ప్రారంభించారు "శవం చచ్చిపోయిందని వార్డెన్‌నే హడలగొట్టేశావురా. గట్టివాడివి శవం చచ్చిపోవడం అంటే ఏమిటిరా?" అన్నారు స్నేహితులు.

ఇప్పుడు అర్థమయింది రామచంద్రానికి తన తప్పు. మనిషి చచ్చిపోయాడు. శవం తగలడుతోంది అనడానికి మాటలు తడబడి, శవం చచ్చిపోయింది అన్నాడు. వార్డెన్ ఏమనుకున్నాడో గాభరాపుట్టింది. కాళ్ళు వణికాయి. వెళ్ళి వార్డెన్‌తో చెప్పు కుందామనుకున్నాడు. కాని ధైర్యంచాలక బాధతో. చిరునవ్వు నవ్వి. ఏదో సమయ స్ఫూర్తిగా "శవం చచ్చిపోయిందంటే మనిషి చచ్చిపోయి శవం అయాడు అన్న మాట. కంట్రైవర్ ఫర్ ది కంపెనీయాన్స్. ఓ అర్థాలంకారంలే అన్నాడు. వార్డెన్‌నే ఎదిరించి ఆయన తికమకపడే జవాబు చెప్పిన మొనగాడని రామచంద్రానికి ఆ రాత్రికి రాత్రే పేరొచ్చేసింది ఇది అతని నాయకత్వానికి ప్రథమ సోపానం

ఓ వారం రోజులు తిరక్కుండా అతని నాయకత్వం ఆఖరిమెట్టు ఎక్కి పోయింది. ఓ రాజకీయ నాయకుడొచ్చి. విద్యార్థులను కూడా సత్యాగ్రహ సమరంలో పాల్గొనవలసిన అవశ్యకతని గురించి ఉపన్యాసమిచ్చాడు. శెట్టి హోటల్లో వేడివేడి పెసరట్టు ఉప్మా నంచుకుంటూ తినడానికి వెళ్ళిన రామచంద్రం ఆ మీటింగుకి హాజరవడం లేదు. రామచంద్రం తిరిగొస్తూ ఉంటే గుంపులు గుంపులుగా విద్యార్థులు తిరిగిపోతున్నారు, మరునాడు

కాలేజీలో సమ్మె జరుగుతుందని పుకారు పుట్టింది. ఏమయితే అది జరక్కుండా చెయ్యాలనే. అసలు ఎవరెవరు సమ్మెలో చేరతారో తెలుసుకుందామని. రాత్రి పదిన్నరకి, హాస్టలులో రూము రూముకీ బయలుదేరాడు వార్డన్. రెండు రూములయిపోయాయి. అంతలో విద్యార్థులు సమ్మెలో పాల్గొనడం లేదని అభయమిచ్చారు. మూడో గది రామచంద్రానిది. అతడు గాఢ నిద్రలో వున్నాడు వార్డెన్ నాలుగుమార్లు తలుపు తట్టితేనేగాని రామచంద్రం తలుపు తీయలేదు. కళ్ళు నలుపుకుంటూ వింటున్నాడు. ఆ నిద్రలో ఎదురుగుండా ఉన్నది వార్డెనని కూడా గుర్తు తెలీలేదు.

"ఏం కావాలి?" అన్నాడు ధీమాగా.

"నువ్వు రేపు సమ్మెలో చేరుతున్నావా?" అన్నాడు వార్డెన్,

"ఆలోచిస్తాను" అన్నాడు రామచంద్రం.

"సమ్మె రేపే. ఎప్పుడు ఆలోచిస్తావు."

"రేపు ఉదయం కావలసినంత టైముంది. రాత్రి నిద్రపోవడానికి ఆలోచించడానికి కాదు. నాకు నిద్దరగా ఉంది. వస్తుంటా వెళ్ళండి." అని గభుక్కున తలుపు వేసాడు రామచంద్రం. తెల్లబోయి. రాత్రి పరిశోధన చాలించుకుని. ఇంటికి తిరిగిపోయాడు వార్డెన్.

హాస్టల్ ఆవరణలో పెద్ద గొడవ.

నిద్రపట్టక బయటకొచ్చాడు రామచంద్రం. విద్యార్థులందరూ చుట్టుముట్టేరు. అతని ధైర్య సాహసాలకి అభినందించారు. పాతికేళ్ళ ఈమధ్య. వార్డెన్ ఈ విధంగా హడలగొట్టిన మనిషి లే న్నారు. రేపటి సత్యాగ్రహానికి నువ్వే మా నాయకుడివన్నారు. రామచంద్ర కాళ్ళు వొణికాయి, నిద్రలో లేపెయ్యడ వల్ల. మత్తులో. అలా మాట్లాడా క్షమించాలి. అని వార్డెన్‌తో చెప్పుకుం మనుకున్నాడు నా మొహం నేనేం నా కుణ్ణి. నాకు సత్యాగ్రహం వొద్దు. ఏ వద్దు. ఇలా జరకవ్వండి అని అభినం స్తున్న విద్యార్థులతో చెబుదామను న్నాడు. భయంచేతో. గాభరావల్లనో నోరు పెగల్లేదు.

హాస్టల్లో రౌడీ సుబ్బన్న "నాకం గొప్పవాడివిరా అని, రామచంద్రాన్ని ఎగరేసి, భుజం మీదికి ఎక్కించుకున్నాడు హాస్టలు ఆవరణంతా వూరేగించాడు

రామచంద్రానికి ముచ్చెమటలు పోశాయి.

కాని, ఏం చెయ్యగలడు!

నాయకుడయిపోయాడు!

